క్లుప్తంగా

ఒకరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు.. తిరుపతికి చెందిన సత్యరాజ్ (23) ద్విచక్ర వాహనంలో శ్రీకాళహస్తికి బయలుదేరారు. సీతారాంపేట సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో అదుపు తప్పి కింద పడ్డాడు. గాయపడిన అతన్ని పోలీసులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సత్యవేడు ఎస్ఐగా వీరాంజనేయులు



సత్యవేడు: సత్యవేడు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా వీరాంజనేయులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రా–తమిళనాడు సరిహద్దులో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఇసుక, మట్టి, మద్యం అక్రమ రవాణా చేస్తే 9440796767 నంబరుకు సమాచారం ఇవ్వాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తప్పనిసరి



మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ మునిరవికుమార్

సత్యవేడు: ప్రతి గ్రామ పంచాయతీలోనూ అభివృద్ధి ప్రణాళికను తప్పనిసరిగా తయారు చేయాలని ఈవోపీఆర్డీ మునిరవికుమార్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సచివాలయాల సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు గ్రామ పంచాయతీ వార్షిక ప్రణాళిక తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో రమణకుమార్, ఎంఈవో కే.రవి, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు తరలిన నేతలు



విజయవాడకు బయలుదేరిన వైఎస్సార్ సీపీ నాయకులు

నాగలాపురం: విజయవాడలో ఏర్పాటుచేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు నాగలాపురం మండల అధ్యక్షుడు టి.అపరంజిరాజు ఆధ్వర్యంలో పలువురు నాయకులు బయలుదేరారు. అపరంజి రాజు మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ సింధూ శ్యామ్, ఎంపీడీవో పీఎంకె బాబు, నాయకులు ఎస్.ఎం.సురేష్, దేశప్పన్, చిరంజీవి, శేఖర్, మహేష్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందెం రాయుళ్లపై కేసు నమోదు

శ్రీకాళహస్తి : కోడి పందేలు ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు శ్రీకాళహస్తి మండలం సింహాచల కండ్రిగ వద్ద కోడి పందేల స్థావరంపై దాడి చేసినట్టు తెలిపారు. రెండు కోళ్లు, రూ.10,500 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్కుర్తి, తదితర గ్రామాలకు చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాలేజీ బస్సు బోల్తా



ప్రమాదానికి గురైన కాలేజీ బస్సు

గంగాధర నెల్లూరు: మండలంలోని మోతరంగనపల్లి సమీపంలోని చిత్తూరు– పుత్తూరు జాతీయ రహదారిలో గురువారం కాలేజీ బస్సు బోల్తా పడింది. ఎస్ఐ రామాంజనేయులు కథనం మేరకు చిత్తూరు నగరంలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీకి చెందిన బస్సు గురువారం విద్యార్థులను ఎక్కించుకుని కాలేజీకి బయలుదేరింది. అతివేగంగా వస్తూ మోతరంగనపల్లి సమీపంలో చిత్తూరు – పుత్తూరు జాతీయ రహదారిలో ఉన్న మలుపు వద్ద చింత చెట్టును ఢీకొని బోల్తా పడింది. 10 మంది విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. సెలవు రోజుల్లో కాలేజీ నిర్వహిస్తున్న యాజమాన్యంపై చర్యలకు అధికారులకు నివేదిక పంపుతామన్నారు.

బాగుపడిన రోడ్డు

- నాడు గుంతల మయమైన మట్టి రోడ్డు
- నేడు సిమెంట్ రోడ్డు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు



నాడు: ఆర్‌అండ్‌బీ రోడ్డు పోతుమానిగుంట ఎస్టీ కాలనీ వరకు ఉన్న మట్టి రోడ్డు



నేడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేసిన సిమెంట్ రోడ్డు

ఏర్పేడు: నాడు గుంతలమయమైన మట్టి రోడ్డుతో నిత్యం ఇబ్బందులు పడేవారమని, నేడు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.53 లక్షలు మంజూరు చేసి సిమెంట్ రోడ్డు వేయడంతో సంతోషంగా ఉందని అంజిమేడు పంచాయతీ వాసులు చెబుతున్నారు. అంజిమేడు పంచాయతీ కృష్ణగిరికాలనీ, పోతుమానిగుంట ఎస్టీ కాలనీలో 390 కుటుంబాలు ఉన్నాయి. ఎక్కువ మంది నిరంతరం తిరుపతి, శ్రీకాళహస్తి పట్టణాలకు వెళ్లి చిన్న చిన్న పనులు చేసుకునే వారే. గతంలో కాలనీల నుంచి అంజిమేడు ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు సుమారు కిలో మీటరు మేర మట్టి రోడ్డు ఉండేది. వర్షాకాలం రోడ్డులో గుంతలు పడడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతోపాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రాత్రిళ్లు ఏవైనా ప్రమాదాలు జరిగితే సకాలంలో ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి. రోడ్డును బాగు చేయాలని అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండాపోయింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక తమ గ్రామానికి సిమెంట్ రోడ్డు వేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అనతికాలంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.53 లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులతో 2022 జూన్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇబ్బందులు పడేవాళ్లం

గతంలో మట్టి రోడ్డులో గుంతలు పడడంతో ఇబ్బందిగా ఉండేది. వర్షాకాలం గుంతల్లో నీరు నిలిచి కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి. టీడీపీ హయాంలో రోడ్డు వేయా లని పలుమార్లు అధికారులను వేడుకున్నా పట్టించుకోలేదు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తమ కష్టాలను గుర్తించి తమ ఏకంగా సిమెంట్ రోడ్డు వేయించారు. –బాలగురవయ్య, కృష్ణగిరి కాలనీ

రోడ్డు చాలా బాగుంది

తమ గ్రామానికి సిమెంట్ రోడ్డు వేశారు. ఏళ్ల తర బడి మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడ్డాం. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చొరవతో సిమెంట్ రోడ్డు వేశారు. ప్రస్తుతం రోడ్డు బాగుండడంతో ఇబ్బంది లేకుండా ప్రయాణం సాగిస్తున్నాం. –విజయేంద్ర, కృష్ణగిరి కాలనీ

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ చేశారు. అనంతరం వినాయక పూజ, కలశ పూజ, వైదిక క్రతువులు చేపట్టారు. పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ,ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతి ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రూ.42 లక్షలతో శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం



బుచ్చినాయుడుకండ్రిగలో నిర్మిస్తున్న శానిటరీ కాంప్లెక్స్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 14 గ్రామ సచివాలయాల వద్ద రూ.42 లక్షలతో సెక్రటేరియట్ శానిటరీ కాంప్లెక్స్‌లను నిర్మిస్తున్నట్టు ఎంపీడీవో కార్యాలయ ఏవో త్రివిక్రమ్ రావు తెలిపారు. ఒక్కో సచివాలయం వద్ద రూ.3 లక్షలతో శానిటరీ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నట్టు తెలిపారు. తద్వారా సిబ్బందితోపాటు ప్రజలకు మరుగుదొడ్ల సమస్య తీరుతుందని పేర్కొన్నారు.

పల్లికొండేశ్వర స్వామి ఆలయ క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నాగలాపురం: మండలంలోని సురుటపల్లిలో వెలసిన సర్వ మంగళా సమేత పల్లికొండేశ్వర స్వామి ఆలయ నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం తిరుపతి జిల్లా కలెక్టరు వెంకటరమణారెడ్డి ఆవిష్కరించారు. ఆయనకు ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీరెడ్డి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వేద పండితులతో ఆశీర్వచనం ఇప్పించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్, కార్యనిర్వాహణ అధికారి కె.రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మన్నసముద్రానికి రూ.1.31 లక్షల ఆదాయం

ఏర్పేడు: చేపల చెరువు వేలంలో మన్నసముద్రం పంచాయతీకి రూ.1.31 లక్షల ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం తెలిపారు. మన్నసముద్రంలో గురువారం పంచాయతీ అధికారులు, గ్రామస్తుల సమక్షంలో చేపల చెరువుకు వేలం పాటలు నిర్వహించారు. ఎస్సీ కాలనీకి చెందిన మాధవయ్య రూ.1.31 లక్షలకు చెరువును దక్కించుకున్నాడు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు తాళ్లపాక నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీల విజేత టీపీ కోట



నాగలాపురం: మండలంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో గురువారం ఉదయం ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇందులో బీరకుప్పం, టీపీ కోట జట్ల మధ్య పోటీ జరిగింది. టీపీ కోట జట్టు విజయం సాధించినట్టు పంచాయతీ కార్యదర్శి హరి, సీనియర్ అసిస్టెంట్ హేమ భూషణం తెలిపారు. మండల అధ్యక్షుడు అపరంజిరాజు, నాగలాపురం సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ శ్యామ్ పాల్గొన్నారు.

ఘనంగా మంగళగౌరి మహోత్సవం



గొబ్బెమ్మ ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



గౌరీ దేవికి పూజలు చేస్తున్న మహిళలు

సత్యవేడు: మండలంలోని కాళమనాయుడుపేట పంచాయతీ గాంధీపురం గిరిజనులు గురువారం మంగళగౌరి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ నాలుగో రోజున గౌరీదేవికి(గొబ్బెమ్మ దేవత) గొబ్బిళ్ల పూజ చేశారు. గౌరీదేవి ఆలయం చుట్టూ ముగ్గులు చేశారు. అనంతరం మంగళగౌరీ దేవి(గొబ్బెమ్మ దేవత) ఊరేగించి గ్రామ పొలిమేరలోని చెరువులో నిమజ్జనం చేశారు.

ఘనంగా గౌరమ్మ నిమజ్జనం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఏడాది పండుగను పురస్కరించుకుని అన్ని గ్రామాల్లో గురువారం గౌరమ్మ నిమ్మజ్జనం కార్యక్రమాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి నెలరోజులపాటు మహిళలు ప్రతిరోజూ సాయంత్రం గ్రామంలో గౌరమ్మ ప్రతిమను ఏర్పాటుచేసి గొబ్బిళ్లు తట్టి, భక్తిగీతాలు ఆలపిస్తారు. ఏడాది పండుగ సంక్రాంతి పండుగ అనంతరం గౌరమ్మ నిమ్మజ్జనాన్ని ఘనంగా నిర్వహిస్తారు.



బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగలోని నాలుగు వీధుల్లోని మహిళలు గొబ్బెమ్మకు ఘనంగా పూజలు చేశారు. వినాయక వీధి, దేవాలయంవీధి, తూర్పుమిట్ట వీధుల్లో అన్నదానం చేశారు. అనంతరం గౌరమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమ్మజ్జనం చేశారు. తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

వేమలమ్మకు పొంగళ్లు

కనమనంబేడు గ్రామ దేవత వేమలమ్మకు గురువారం గ్రామస్తులు ఘనంగా పొంగళ్లు పెట్టారు. ప్రసాదాలను పంపిణీ చేశారు. వేమలమ్మ దేవత విగ్రహాన్ని పాలతో అభిషేకించి, పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి సంవత్సరం ఏడాది పండుగ రోజున వేమలమ్మకు పొంగళ్లు పెట్టడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు.

గొబ్బెమ్మకు పూజలు

సత్యవేడు: మండలంలోని నరసరాజు అగ్రహారంలో గురువారం గౌరమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అమ్మవారిని బంగారు నగలు, నూతన దుస్తులతో అలంకరించారు. సాయంత్రం గ్రామంలోని స్త్రీనిధి గ్రూపు, చెంగాలమ్మ సంఘం, శ్రీలక్ష్మి, ముత్యాలమ్మ గ్రూపు, అంకాల పరమేశ్వరి, శ్రీసాయి, వెంకయ్యస్వామి, శ్రీజ్యోతి, గంగమ్మ, చెంగాలమ్మ సంఘాల మహిళలు కలిసి నడి వీధిలో గొబ్బెమ్మను కొలువుదీర్చారు. సంతోషంగా గొబ్బి పాటలు పాడారు. అమ్మవారికి గొంగళ్లు పెట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.







పొంగళ్లు పెడుతున్న గ్రామస్తులు, వేమలమ్మకు పూజలు చేస్తున్న పూజారి, బుచ్చినాయుడుకండ్రిగ: వినాయక వీధిలో అన్నదానం

వైఎస్సార్ సీపీ నేతకు ఘన నివాళి



దాముునాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



దాముునాయుడికి నివాళులర్పిస్తున్న ఎంపీ గురుమూర్తి

కేవీబీపురం: మండలంలోని రాజులకండ్రిగకు చెందిన వైఎస్సార్ సీపీ నేత గాలి దాముునాయుడు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తిరుపతి ఎంపీ గురుమూర్తి రాజులకండ్రిగకు చేరుకుని దాముునాయుడు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దాముునాయుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. దాముునాయుడి తండ్రి గాలి నాదమునినాయుడు కేవీబీపురం ఎంపీపీగా పని చేశారు. పార్టీ కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, నేతలు నందకుమార్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు హరిబాబు, మాజీ జెడ్పీటీసీ డేవిడ్, శాస్త్రిరాజు, అరుల్, బాలసుబ్రమణ్యం, పూడి మణి, జెడ్పీటీసీ మునెమ్మ, ఎంపీటీసీ సుబ్బన్న, ఢిల్లీ, గిరిబాబు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

శ్రీకాళహస్తి : క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని టాటా ట్రస్టు క్యాన్సర్ హాస్పిటల్ వైద్య నిపుణులు వెంకయ్యబాబు తెలిపారు. తొట్టంబేడు మండలం కాసరం సచివాలయం పరిధిలో గురువారం రాస్, టాటా ట్రస్టు శ్రీవెంకటేశ్వర క్యాన్సర్ ఆసుపత్రి సంయుక్తంగా ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, ఎపటైటిస్ బీ, సీ, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌కు సంబంధించి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. టాటా ట్రస్టు ప్రతినిధులు రెడ్డికుమారి, మెహతాజ్, అర్చన, రాస్ ఫీల్డ్ ఆఫీసర్ గిరిప్రసాద్, యానిమేటర్ జయంతి, జయలలిత, రాజశేఖర్, క్లస్టర్ లీడర్లు పాల్గొన్నారు.

తలనీలాల వేలం రేపు

పుత్తూరు: వడమాలపేట మండల పరిధిలోని సదాశివ కోనకు సంబంధించి తలనీలాల వేలం పాటను ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జయచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని స్థానిక వీరాంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం ఉదయం వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేలంపాటలో పాల్గొన దలచిన వారు ముందుగా రూ.15 వేలు డిపాజిట్ చెల్లించాలని వెల్లడించారు. కామాక్షి దీపాల సేకరణకు రూ.10 వేలు, తాత్కాలిక అంగళ్ల ఏర్పాటుకు రూ.5 వేలు డిపాజిట్లు చెల్లించాలని వివరించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం





బాధితులకు నగదు అందజేస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం వెలంపాడులో ఇటీవల మృతిచెందిన ముగ్గురి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన యలసిరి వెంకటేశ్వర్లు, యలసిరి పోలమ్మ, బసినోలు ఈశ్వరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తన కుమారుడు ఆకర్ష్ రెడ్డి ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున అందజేశారు. నాయకులు రఘునాయుడు, ప్రసాద్‌రెడ్డి, చెంచుకృష్ణరాయల్, నరసింహారెడ్డి, ధర్మయ్యరాయల్, చిరంజీవియాదవ్, చెంచయ్య, ప్రసాద్, పోలయ్య, గురవయ్య, వెంకటయ్య, శేఖర్ రాయల్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మామిడిలో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి

వెదురుకుప్పం: సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు. వెదురుకుప్పంలో గురువారం మామిడి రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఉద్యానశాఖ సిబ్బంది అందుబాటులో ఉన్నారని, మామిడి సాగులో వారి సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పూత ప్రారంభమయ్యే అవకాశం ఉందని, వాతావరణ మార్పులకు అనుగుణంగా పూత రాలిపోకుండా మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 29 మండలాల్లో మామిడి ప్రధాన పంట అని తెలిపారు. నాణ్యమైన దిగుబడి పొందేందుకు రైతులు ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

విద్యుత్‌ను ఆదా చేయండి

- రాష్ట్ర విద్యుత్ వినియోగ మిషన్ డైరెక్టర్ సుబ్రమణ్యం



మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ సుబ్రమణ్యం

పుంగనూరు: ప్రతి ప్రాంతంలోను, ప్రతి ఇంటా విద్యుత్‌ను ఆదా చేయడం అలవరచుకోవాలని రాష్ట్ర విద్యుత్ వినియోగ మిషన్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రమణ్యం కోరారు. గురువారం మున్సిపాలిటీలో చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగం–పొదుపుపై రెండు రోజులు అవగాహన సదస్సు నిర్వహించారు. సుబ్రమణ్యం మాట్లాడుతూ, విద్యుత్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే ప్రస్తుతం సౌర విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోందన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో వీధి దీపాలు, బోర్లలో విద్యుత్ వినియోగం ఎక్కువైందని, ట్యాంకులు నిండినా మోటార్లు ఆపకపోవడం, విద్యుత్ దీపాలు పగలు కూడా ఆఫ్ చేయకపోవడం వల్ల విద్యుత్ దుబారా అవుతోందని విశ్లేషించారు. దీనివల్ల ప్రభుత్వ సంస్థలకు అధిక భారం పడుతోందన్నారు. ఈ దుబారాపై దృష్టి సారించి నియంత్రిస్తే విద్యుత్ ఎంతో ఆదా అవుతుందన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు వెంకట్రమణ, డీఈఈలు శ్రీనివాసులు, మహేష్, ఏఈ కృష్ణకుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఎనర్జీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అలరించిన చిన్న కొండచుట్టు



చిన్నకొండ చుట్టు ఉత్సవాల సందడి

నగరి: పట్టణంలోని భేరివీధిలో గురువారం నిర్వహించిన చిన్నకొండచుట్టు ఉత్సవం చిన్నారులను అలరించింది. కొండచుట్టు ఉత్సవానికి మరుసటి రోజున పట్టణంలోని భేరివీధిలో వలస వ్యాపారులు దుకాణాలు పెట్టడం పరిపాటి. దీంతో వీధిలో తిరునాళ్ల సందడి కనిపిస్తోంది. స్థానికులు దీన్ని చిన్న కొండచుట్టు ఉత్సవాలుగా పిలుచుకుంటారు. చిన్నారుల ఆటబొమ్మలు, మహిళలకు సంబంధించిన అలంకరణ వస్తువులు, చెరుకుగడలు, తినుబండారాలు ఇక్కడ అధికంగా విక్రయిస్తారు. వాటిని కొనుగోలు చేసుకోవడానికి, వివిధ రకాలైన రంగుల రాట్నాల్లో తిరగడానికి పిల్లలు ఉత్సాహం చూపారు. దీంతో వీధి మొత్తం జనంతో నిండిపోయింది.